త్వరలో అన్ని గ్రామాల్లో రోడ్ల నిర్మాణం

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

త్వరలో అన్ని గ్రామాల్లో రోడ్ల నిర్మాణం చేపతామని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి మండలం మోరిపోడులో రోడ్డు పనులను ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.40 లక్షల వ్యయంతో మల్కిపురం చొప్పెల వారి వంతెన నుంచి మోరిపోడు, మోరి పిహెచ్సి వరకు రోడ్డు మరమ్మతులు చేస్తామన్నారు.

కదలని కోనసీమ రైలు

- ఈసారైనా బడ్జెట్ లో కూత వినిపించేనా...!
- కోటిపల్లి-నరసాపురం రైలు 22 ఏళ్లు ఆలస్యం
- రైల్వే లైన్ పై కూటమి ప్రభుత్వం పై ఆశలు.
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

కోటిపల్లి-శానపల్లిలంక మధ్య గౌతమి నదిపై నిర్మితమవుతున్న రైల్వే వంతెన, కోటిపల్లి రైల్వే స్టేషన్

ప్రజాశక్తి - రాజోలు

కోనసీమ ప్రజల చిరకాల వాంఛ అయిన కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. రాష్ట్ర ప్రభుత్వం లెక్కలేనితనంతో లైను పూర్తి కావడం ఇప్పట్లో అసాధ్యంగా మారింది. కేంద్రం ఇచ్చే నిధులకు పదేళ్లలలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా జోడించాల్సి ఉండగా అంతులేని అశ్రద్ధ చూపుతోంది.

22 ఏళ్ల క్రితం శంకుస్థాపన

కోనసీమ ప్రజలకు రైలుమార్గం తెస్తే రాకపోకలకు అనువుగా ఉంటుందని మాజీ స్పీకర్ బాలయోగి ఈ ప్రాజెక్టును కష్టపడి సాధించారు. కోటిపల్లి నుంచి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని నరసాపురం వరకు 57 కిలోమీటర్ల మేర ఈ రైల్వే లైను నిర్మాణానికి 2002లో శంకుస్థాపన జరిగింది. అనేకసార్లు ప్రాజెక్టు అంచనా వ్యయం సవరించగా, ప్రస్తుతం రూ.2,525 కోట్లకు చేరింది. లైను నిర్మాణంలో భాగంగా గోదావరిపై మూడు వంతెనల నిర్మాణంతోపాటు కోటిపల్లి, మాగం, అమలాపురం, పేరూరు, పాశర్లపూడి, జగ్గన్నపేట, రాజోలు, చించినాడ, నర్సాపురం ప్రాంతాల్లో రైల్వేస్టేషన్లు కూడా నిర్మించాల్సి ఉంది. అయితే ఎప్పటికప్పుడు నిధుల సమస్యతో లైను నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటాగా రూ.357.96 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు రూ.2.69 కోట్లు మాత్రమే ఇచ్చింది. దీంతో పనులు ఎక్కడివక్కడే అన్నట్టు ఆగిపోయాయి. ముఖ్యంగా గోదావరి మూడు వంతెన నిర్మాణ పనులు ఆపివేస్తున్నట్టు గతేడాది డిసెంబరులో రైల్వేశాఖ ప్రకటించింది. కేవలం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వకపోవడమే ఇందుకు కారణంగా పేర్కొంది.

భారీగా పెరిగిన అంచనా వ్యయం

2001 డిసెంబరు నెలలో రూ.1,045.20 కోట్లుతో ఆమోదం పొందిన ఈప్రాజెక్టు షెడ్యూల్ ప్రకారం 2009 మార్చి నాటికి పూర్తికావాల్సి ఉంది. అయితే అనుకున్న సమయానికి ఇది ఏమాత్రం పూర్తికాకపోగా ఇప్పటికే రూ.1,141.44 కోట్లు మేర ఖర్చుచేశారు. అయినా పూర్తికాలేదు. తాజా అంచనాల ప్రకారం రూ.2,500.98 కోట్లు వరకు వెచ్చించాల్సి ఉందని నివేదికలో తేలింది. ఇది గత అంచనాలకు 140 శాతం అధికం.

మూడు వంతెనలే కీలకం..!

ప్రతిపాదించిన మూడు వంతెనల్లో యలమంచిలి మండలం చించినాడ నుంచి దిండి వరకు వశిష్ఠా గోదావరిపై 20 పిల్లర్లతో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే 18 పిల్లర్ల నిర్మాణం పనుల 15 మీటర్ల ఎత్తు వరకు వచ్చాయి. ఇంకా 15 మీటర్లు పెంచాలి. ఇక రెండో వంతెన ముక్తేశ్వరం-కోటిపల్లి మధ్య గౌతమి నదిపై 45 పిల్లర్లకుగాను అన్ని పిల్లర్ల పునాది నుంచి 40 మీటర్ల ఎత్తు వరకు వచ్చాయి. ఇంకా పది మీటర్లు ఎత్తు పెంచి శ్లాబ్ వేస్తే వంతెన పనులు పూర్తవుతాయి. ఇక మూడో వంతెన వైనతేయ నదిపై 21 పిల్లర్లతో పాశర్లపూడి - బోడసకుర్రు వంతెన పనులు చేపట్టగా ఇప్పటికే 18 పిల్లర్ల పనులు మొదలయ్యాయి.

కదలని ట్రాక్, మౌలిక వసతులు

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైనుకు సంబందించి ఇప్పటి వరకు విడుదైలన నిధుల ద్వారా మూడు నదీపాయలపై వంతెన నిర్మాణాలకు సంబందించి పిల్లర్ల పనులు మాత్రమే జరుగుతున్నాయి. గతేడాది బడ్జెట్టులో రూ.296.51 కోట్లు నిధులు కేంద్రం కేటాయించింది.. ఈ నిధుల ద్వారా రైల్వే ట్రాక్, స్టేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే పిల్లర్లు నిర్మాణం పూర్తయిన వంతెన పైభాగంలో ఐరెన్ రెయిల్స్, బాక్సు గడ్డర్లు ఇతర పనులు చేపట్టేందుకు టెండర్లు కూడా పిలిచింది. అయితే మూడు నదీపాయలపై పూర్తయ్యిన పిల్లర్లపై ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు.

కోనసీమ అభివృద్ధికి కీలకం

ఈ రైల్వేలైన్ కోనసీమ అభివృద్ధికి కీలకం. కొత్తగా ఏర్పడిన జిల్లా కావడం, సరైన రవాణా సౌకర్యం లేక ఈ ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది. రైల్వేలైన్ ఏర్పాటు చేస్తే పర్యాటకంగా అభివద్ధి చెందడానికి దోహదమవుతుంది. నిత్యం జిల్లా నుంచి ప్రయివేటు, ఆర్‌టిసి బస్సుల్లో వేలాది మంది హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళతుంటారు.అంతే కాకుండా ఈ రైల్వే లైను వల్ల పంటల, ఆక్వా ఉత్పత్తులు రవాణా సౌకర్యం కలుగుతుంది. ఎపిలోని ఓడ రేవులను ఈ రైల్వే మార్గం ద్వారా అనుసంధానం చేయవచ్చు.

–కారెం వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కన్వీనర్

అరకొరగానే రాష్ట్ర వాటా నిధులు

కోటిపల్లి-నర్సాపురం కొత్త రైలు మార్గానికి తొలిసారిగా కేంద్రం రూ.220 కోట్లు, తర్వాత బడ్జెట్లో రూ.440 కోట్లు, 2019 ఎన్నికలకు ముందు కేంద్రం మధ్యంతర బడ్జెట్లో రూ.200 కోట్లు, 2020 బడ్జెట్లో రూ.551 కోట్లు, 2021లో రూ.187 కోట్లు 2022, 2023 బడ్జెట్లో రూ.100 కోట్లు. ఈ ఏడాది ఎన్నికల ముందు బడ్జెట్లో రూ.300 కోట్లు కేటాయించారు. ఎన్నికల తరువాత గత బడ్జెట్‌లో కేంద్ర రూ.300 కోట్లు కేటాయించింది. రాష్ట్ర వాటా రూ.525 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.2.69 కోట్లు మాత్రమే కేటాయించింది. కేంద్రం అడపాదడపా నిధులు ఇస్తున్నా పదేళ్లలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు రాష్ట్ర వాటా విదల్చకుండా ప్రాజెక్టుపై ఆసక్తి చూపలేదు. దీంతో నిర్మాణంలో ఏళ్ల జాప్యంతో అంచనా వ్యయం పెరిగింది.

రైల్వే లైన్ నిర్మాణానికి కృషి

కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ 57.21 కిలోమీటర్ల మేర 25 శాతం రాష్ట్ర వాటా కేటాయింపునకు రాష్ట్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి రైల్వే లైన్ నిర్మాణంకు కషి చేస్తాను. ఇప్పటికే కోటిపల్లి-అమలాపురం రైల్వేలైన్‌కు సంబంధించి పూర్తి స్థాయిలో ఇప్పటికే సేకరించిన భూములను రైల్వే శాఖకు అప్పగించాలని, లైన్మెంట్ ప్రతిపాదనలను అన్నింటిని క్రోడీకరించి అన్ని విధాలుగా ఆమోదకరమైన ఒక ఎలైన్మెంట్ను రూపొందించే ప్రయత్నం జరుగుతోంది. రానున్న రోజుల్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలు రైలు కూత వింటారు.

- దేవ వరప్రసాద్, ఎంఎల్ఎ రాజోలు

కలెక్టరేట్‌వ వద్ద ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు, ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి

104 ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

- పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి
- 104 ఉద్యోగుల సంఘం కలెక్టరేట్ వద్ద ధర్నా
- మద్దతు తెలిపిన వివిధ ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - అమలాపురం

104 ఉద్యోగులు న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) అన్నారు. 104 రాష్ట్ర కమిటీ (సిఐటియు అనుబంధం) పిలుపు మేరకు అన్ని జిల్లా కలెక్టరేట్లు వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. దీనిలో భాగంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా 104 యూనియన్ జిల్లా ఉద్యోగులు అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాని ఉద్దేశించి పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ 104 సంఘం చేసే న్యాయబద్ధమైన ధర్నాకి మద్దతు తెలుపుతున్నానని అన్నారు. వారి యొక్క న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. అదే విధంగా వాళ్ళందరినీ కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. దుర్గాప్రసాద్, సిఐటియు ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, ఉపాధ్యక్షులు భాస్కరరావు సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, 108 ఉద్యోగుల రాష్ట్ర నాయకులు ఎం శ్రీనివాసరావు, ఆశా జిల్లా అధ్యక్షురాలు ఎస్తేర్ రాణి, కోశాధికారి సీత, వ్యవసాయ సంఘ నాయకురాలు దైవ కృప,104 సంఘం చేస్తున్న ధర్నాకి మద్దతు తెలియజేశారు. 104 కోనసీమ అధ్యక్షులు పి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పి.త్రిమూర్తులు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి .శ్రీనివాసరావు, కోశాధికారి కె.ఓం ప్రకాష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'ఆర్ట్ ఆఫ్ ఎపి'లో చిత్రకారుడు అంజికి స్థానం

ప్రజాశక్తి - కాట్రేనికోన

వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ కి చెందిన ప్రముఖ చిత్రకారులు అందరినీ ఒకచోటకి చేరుస్తూ వారి వారి చిత్రకళా ప్రస్థానం,వారి చిత్రకళా ప్రతిభను తెలుపుతూ ప్రముఖ జాతీయ స్థాయి అంతర్జాల పత్రిక 64కళలు.కాం సంస్థ దాదాపుగా 300 మంది చిత్రకారులతో ఆర్ట్ ఆఫ్ ఎపి అనే పుస్తకాన్ని ఇటీవల ప్రచురించింది. ఈ పుస్తకంలో కాట్రేనికోన మండలానికి చెందిన చిత్రకారులు అంజి ఆకొండికి స్థానం లభించింది. ఈ సందర్భంగా ఆదివారం విజయవాడలో ఎపి రాష్ట్ర పర్యా టక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ పుస్తకా విష్కరణ చేశారు. అనంతరం మంత్రి చేతులు మీదుగా అంజి ఆకొండి ఆర్ట్ అఫ్ ఎపి పుస్తకాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలోముఖ్య అతిధిగా మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, 64కళలు.కామ్ వ్యవస్థాపకులు వై.కళాసాగర్ పాల్గొన్నట్లు చిత్రకారుడు అంజి తెలిపారు.

పుస్తకం అందుకుంటున్న అంజి

ప్రారంభిస్తున్న ఎంపి హరీష్, ఎంఎల్ఎ దాట్ల

డ్రీమ్ ల్యాండ్ ఫంక్షన్ హాల్ ప్రారంభం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నూతనంగా నిర్మించిన డ్రీమ్ ల్యాండ్ ఫంక్షన్ హాల్ ను ఆదివారం రాత్రి ఎంపి గంటి హరీష్ మాదూర్చ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమలాపురం ఎంపి గంటి హరీష్ మాట్లాడుతూ ఫంక్షన్ హాల్ లు వ్యాపార దక్పథంతో కాకుండా సామాన్యులకు సైతం అందుబాటులో ఉండేలా నిర్వహించాలని అన్నారు. ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో ఇంటి ఆవరణలో ఖాళీ స్థలాలు కరువు అవడంతో ప్రతి ఒక్కరు వివాహాది కార్యక్రమాలకు ఫంక్షన్ హాల్ లను ఆశ్రయించవలసి వస్తుంది అన్నారు. నూతనంగా నిర్మించిన డ్రీమ్ ల్యాండ్ ఫంక్షన్ హాల్ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విక్టరీ వెంకట్ రెడ్డి, పెన్మత్స జగ్గప్ప రాజు, గుత్తుల సాయి, చెల్లి అశోక్, గొల్లకోటి దొరబాబు, చింతపల్లి అజయ్ కుమార్, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, గుద్దటి జమ్మి రంబాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

ఆక్రమణల చెరలో వెంకటాయపాలెం బస్టాండ్

- ఫ్లెక్సీలతో మూసివేసిన వైనం
- కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

బస్టాండ్ కనబడకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

వెంకటాయపాలెం గ్రామస్తులకు ఉపయోగపడే బస్టాండ్ కొంతకాలంగా నిరాదరణకు గురై ప్రస్తుతం ఆక్రమణల చెరలో మగ్గుతుంది. 1982లో అప్పటి ఎమ్మెల్యే పిల్లి అప్పారావు ఆధ్వర్యంలో దీనిని నిర్మించారు. వెంకటాయపాలెం, చిన్నంపేట, దాసరి పాడు, కుందాలమ్మ చెరువు, ఎల్లమ్మ పంపు గ్రామానికి చెందిన విద్యార్థులకు ప్రయాణికులకు ఈ బస్టాండ్ నిత్యం ఉపయోగపడేది. ఈ బస్టాండ్ గత పది ఏళ్లుగా శిధిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు పంచాయతీ ద్వారా దీనిని అభివద్ధి చేసేందుకు అనుమతులు కోరారు. ఆర్ అండ్ బి కి చెందిన ఈ స్థలం లక్షల రూపాయలు విలువ చేయడంతో కొందరు గ్రామస్తులు ఈ స్థలం కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా బస్టాండ్ చుట్టూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రయాణికులు ఎవరు లోపలికి రాకుండా అడ్డుకట్ట వేశారు. శిధిలావస్థలో ఉన్న ఈ బస్టాండ్ ప్రయాణికులు లోనికి వెళ్లేందుకు కూడా లేక బయట నిలబడి ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఈ బస్టాండ్ అభివద్ధి చేసుకునేందుకు ప్రయాణికులు గ్రామస్తులకు అనుమతి ఇవ్వాలని,, బస్టాండ్ చుట్టూ ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని దీనిపై ఆర్ అండ్ బి అధికారులు స్పందించి చర్యలు చేపట్టే లాగా చూడాలని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు

సదస్సులో మాట్లాడుతున్న సిఐ మోహన్‌కుమార్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

బాలబాలికలు, మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ముమ్మిడివరం సిఐ ఎం.మోహన్ కుమార్ సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని కాశీవాని తూము సెంటర్‌లోని తారా కళాశాల్లో ఆదివారం ప్రిన్సిపల్ కె.శ్రీనివాస్ అధ్యక్షతన మహిళా సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సిఐ మోహన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వం మహిళలు మరియు బాల బాలికల రక్షణ కు ఎన్నో చట్టాలను అమలు చేస్తుందన్నారు. మహిళలను వేదింపులకు గురి చేసినా, ఈవ్ టీజింగ్ కు పాల్పడినా పొక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి శిక్షిస్తారన్నారు. ఎస్ఐ జ్వాలా సాగర్ మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జివి.సుమంత్, వై.వెంకటలక్ష్మి , అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్

ప్రజాశక్తి - ఐ.పోలవరం

మురమళ్ళ గ్రామ పంచాయితీ పరిధిలో మంచి నీటి చెరువు సమీపంలో ఉన్న స్థలంలో శెట్టిబలిజ కార్తీక మాస ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం శెట్టిబలిజ యువజన సంఘం యాక్షన్ ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో ఎస్‌బిఎస్ మండల అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గా గణేశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఉన్న వివిధ గ్రామాల నుండి శెట్టిబలిజ కుటుంబాలు హాజరైనారు.సమావేశానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ ,స్థానిక ఎం ఎల్ ఎ దాట్ల సుబ్బరాజు హాజరైనారు.పలువురు నాయకులు మాట్లాడారు. అమలాపురంలో ఈ నెల 24తేదీన శెట్టిబలిజ కార్తీక మాస వన సమారాధన ఆత్మీయ సమ్మేళనానికి కుటుంబ సమేతంగా క్రమ శిక్షణతో కలిసి రావాలని పిలుపు నిచ్చారు. మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుడిపూడి శివన్నారాయణ మాట్లాడుతూ శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నావంతు రూ.ఐదు లక్షలు విరాళంగా ఇస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ కి సంబందించిన 50సెంట్లు స్థలాన్ని కేటాయించి త్వరలో కమ్యూనిటీ హాలు నిర్మిస్తామ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, వనచర్ల వెంకటేశ్వరరావు, ఐవి.నారాయణ, విత్తనాల సత్య మూర్తి, ఇళ్ల సురేష్ ,గుత్తుల మల్లేశ్వరరావు,తదితర నాయకులు పాల్గొన్నారు.

21న సాగునీటి సంఘాలకు ఎన్నికలు

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రకాష్ బాబు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని నాలుగు నీటి సంఘాలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియను ఈనెల 21న నిర్వహించనున్నట్లు తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు తెలిపారు. మండల విద్యా వనరుల శాఖ కార్యాలయంలో పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉన్న రైతుల ఓటర్ల జాబితాలను స్థానిక రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఇప్పటికే సిద్ధం చేశామన్నారు. మండలంలో మడికి, చొప్పెల్ల, చింతలూరు, ఆలమూరులకు సంబంధించి నాలుగు నీటి సంఘాలు ఉండగా ఒక్కొక్క నీటి సంఘంలో 12 చొప్పున మొత్తం 48 డిసిలు ఉన్నాయన్నారు. వాటి పరిధిలోని రైతుల వివరాలను సేకరించి ఇందులో మతుల వివరాలను నమోదు చేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులకు ఎటువంటి సందేశాలు ఉన్నా గ్రామస్థాయిలో ఉన్న రెవెన్యూ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సుబ్బరాజు, రెవెన్యూ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి చికిత్స కోసం సాయం

రూ.30 వేలు అందజేస్తున్న యువ శెట్టి బలిజ సంఘ సభ్యులు

ప్రజాశక్తి - కొత్తపేట

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడికి వైద్య చికిత్స నిమిత్తం కొత్తపేట మండల యువ శెట్టిబలిజ సంఘం ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. కొత్తపేట మండలం రాముడు నూతి మెరక గ్రామానికి చెందిన దంగేటి శేఖర్ ఇటీవల రావులపాలెం బ్రిడ్జి మీద ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి రాజమహేంద్రవరం బొలినేని ఆసుపత్రి నందు చికిత్స అందించారు. కానీ సుమారుగా ఒక సంవత్సరం వరకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులు తెలియజేశారు. అతని కుటుంబ సభ్యులు ఇంటి వద్దనే అతనికి వైద్య సేవలు చేస్తూ ప్రతి పదివేను రోజులకు ఒకసారి వైద్య చికిత్సకు రాజమహేంద్రవరం తీసుకువెళుతున్నారు. అతని ఆర్థిక పరిస్థితి కూడా అంతాంత మాత్రమే ఉండటంతో వైద్య చికిత్సకు కూడా కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారని విషయం తెలుసుకుని కొత్తపేట మండల యువ శెట్టి బలిజ సంఘం వారు వైద్య చికిత్స నిమిత్తం రూ.30వేలు సాయం అందించారు.ఈ కార్యక్రమంలో యువ శెట్టిబలిజ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బివిసి అక్షర స్కూల్‌కు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న బోనం సతీష్

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం పేరూరువై జంక్షన్ విక్టరీ బజారు ఎదురుగా బివిసి విద్యా సంస్థ నూతనంగా ప్రారంభించబోతున్న అక్షర స్కూల్ శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బివిసి అధినేత బోనం కనకయ్య, బివిసి సంస్థ వైస్ ఛైర్మన్ బోనం కష్ణ సతీష్, బండిగుప్తవు పాండు రంగ, యాళ్ల దొరబాబు, గంధం పల్లంరాజు, కల్వకొలను తాతాజీ, దెందుకూరి సత్తిబాబు రాజు, మట్టపర్తి నాగేంద్ర, డాక్టర్ గంధం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎఐఎస్ఎఫ్ 'ప్రథమ మహాసభ

ప్రజాశక్తి - అమలాపురం

పట్టణంలో ఆదివారం ప్రెస్‌క్లబ్ నందు అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రథమ మహాసభను నిర్వహించారు. స్థానిక బస్‌స్టాండ్ నుంచి గడియార స్తంభం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు..అనంతరం అమలాపురం ప్రెస్ క్లబ్ వద్ద మాజీ విద్యార్థి నాయకులు జె.యేసురాజుచే ఎఐఎస్ఎఫ్ పతాక ఆవిష్కరణ చేసుకొని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి కళాకారులచే అభ్యుదయ గేయాలపనతో ప్రతినిధుల సభ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్‌జీ, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, ఎఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు దేవ రాజేంద్ర హాజరయ్యారు. అనంతరం నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కె.వెంకట్, జి.రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు గా వెన్నెల, సతీశ్, సందీప్, సహాయ కార్యదర్శులుగా సాయిరామ్, భాను కార్తిక్, రషీద్, కోశాధికారిగా లావణ్యను, 19 సమితి సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ విద్యార్థి నాయకులు యేసు దాసు, రామకృష్ణ, కొండలరావు, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రం అందుకుంటున్న చిట్టిబాబు

కాంగ్రెస్ పార్టీ పి.గన్నవరం కో-ఆర్డినేటర్‌గా 'కొండేటి'

ప్రజాశక్తి - మామిడికుదురు

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబును పి గన్నవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ ఎపిసి సి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. చిట్టిబాబు నియామకం పట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మహమ్మద్ ఆరిఫ్, మాచవరపు శ్రీమన్నారాయణ, నెల్లి వెంకటరమణ, అప్పన్న శ్రీరామకష్ణ, మొల్లేటి వెంకటేశ్వరరావు, నేతల నాగరాజు, కొండేటి వెంకటేశ్వరరావు,గేడ్డం వెంకటేశ్వరరావు తదితరులుహర్షం వ్యక్తం చేస్తూ చిట్టి బాబుకి శుభాకాంక్షలు తెలిపారు



స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ డిసి

వెంకన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ని ఆదివారం ఆంధ్ర రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కె. మహేశ్వర రావు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. అనతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ డిసి నల్లం చక్రధర్ రావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు .స్వామి వారి దర్శన అనంతరం తీర్ధ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్లోని గోదావరి భవన్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈనెల 11 సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా నిర్వహిస్తారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉద్యాన పంటలు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తితో జిల్లా ఉద్యాన అధికారి బివి.రమణ

ప్రజాశక్తి- అమలాపురం

తమ శాఖ ద్వారా ప్రభుత్వం ఉద్యాన పంటలు, పరిశ్రమలకు పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నామని జిల్లా ఉద్యాన అధికారి బివి.రమణ తెలిపారు. ఉద్యాన రైతులకు అందిస్తున్న రాయితీలను ఉపయో గించుకో వడంతో పాటు అధిక ఆదాయం ఆర్జించే పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. ఉప ఉత్పత్తులు తయారు చేసుకుంటూ గిట్టుబాటు ధర పొందాలన్నారు. ఇంకా పలు విషయాలను ఆయన ప్రజాశక్తితో పంచుకున్నారు.

జిల్లాలో ఏ ఉద్యాన పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నాయి?

జిల్లాలో ఎక్కువగా కొబ్బరి, జీడి మామిడి, ఆయిల్ పామ్, మామిడి, అరటి, కర్ర పెండలం, కాయగూరలు, పూలు, పసుపు, బొప్పాయి తదితర పంటలు సాగవుతున్నాయి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 90 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఇందులో సుమారు 30 వేల ఎకరాల్లో జీడి మామిడి, 28 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్, 20 వేల ఎకరాల్లో మామిడి, సుమారు 4 వేల ఎకరాల్లో అరటి, మిగిలిన విస్తీర్ణంలో దానిమ్మ, నిమ్మ, నారింజ, జామ, బొప్పాయి తదితర పంటలు సాగవుతున్నాయి.

శీతల గిడ్డంగుల నిర్మాణానికి రాయితీలు ఇస్తున్నారా.?

రైతులకు,రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 30 మెట్రిక్ టన్నుల కెపాసిటీ గల శీతల గిడ్డంగుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15 లక్షల యూనిట్ విలువలో రూ.11.25 లక్షలు వరకూ రాయితీ ఇస్తుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం జరుగుతుంది. ఈ యూనిట్లను నెలకొల్పుకునే రైతులు ఉద్యాన శాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

ఆహార పదార్థాల శుద్ధీకరణ యూనిట్లకు ఎటువంటి రాయితీలు ఉన్నాయి...

జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కార్యక్రమంలో భాగంగా అన్ని రకాల రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆహార పదార్థాల శుద్ధీకరణ యూనిట్ల కోసం రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. రూ.30 లక్షల యూనిట్ విలువకు ప్రభుత్వం గరిష్టంగా 35 శాతం రాయితీలను ఇస్తుంది. అలాగే యూనిట్ విలువలో 90 శాతం బ్యాంకు రుణాలు కూడా ఇప్పించే ఏర్పాట్లు చేస్తున్నాం.

సమీకత ఉద్యాన పంటల అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

సమీకృత ఉద్యాన పంటల అభివృద్ధి పథకంలో భాగంగా మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్‌లను ప్రభుత్వం అందజేస్తుంది. యూనిట్ విలువ రూ.25 లక్షలు ఉంటుంది. జీడి పిక్కల ప్రాసెసింగ్, మామిడి తాండ్ర తయారీ తదితర పరిశ్రమలను ఈ పథకంలో భాగంగా నెలకొల్పుకునే అవకాశం ఉంది. ఇందులో భాగంగా ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుంది. ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా మరో 35 శాతం అదనంగా రాయితీ కల్పిస్తాం. జిల్లాలో 10 యూనిట్ల మంజూరుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. ఎస్‌సి లబ్ధిదారులు కూడా అవకాశం ఉంది.

ఆధునిక సాగు పద్ధతులను ఏ విధంగా ప్రోత్సహిస్తున్నారు.?

ఆధునిక సాగు పద్ధతుల్లో భాగంగా ఉద్యాన శాఖ షెడ్ నెట్ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. 35 శాతం సబ్సిడీతో పూలు, కూరగాయలు వంటివి సాగు చేసుకోవచ్చు.వీటి ద్వారా అధికాదాయం పొందొచ్చు.

అంతర పంటలపై అవగాహన కల్పిస్తున్నారా..

రైతులు అదనపు ఆదాయం పొందేందుకు అంతర పంటలు ఉపయోగకరంగా ఉంటాయి. కొబ్బరి, ఆయిల్ ఫాం తదితర పంటలలో కురగాయలు, అల్లం, పసుపు, కంద, కోకో, మిరియాలు వంటి పంటలను వేసుకోవచ్చు. వీటిని ఉద్యానశాఖ తరుపున రాయితీలో అందిస్తున్నాం.

ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలా...

రైతుల పంటలకు ఇన్ ఫుట్ సబ్సిడీ రావాలన్నా, ఇన్సూరెన్స్ పొందాలన్నా, బ్యాంకుల నుంచి రుణాలు కావాలన్నా ఇలా ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి పొందాలన్నా ఈ-పంట నమోదు తప్పనిసరి. జిల్లాలో 85 శాతం మామిడి, జీడిమామిడి ,కొబ్బరి, ఆయిల్ ఫామ్ తదితర దీర్ఘకాలిక పంటలు,15 శాతం కూరగాయలు, పసుపు, బొప్పాయి, పూలు,పండ్లు తదితర పంటలను రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలి.

కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

కొబ్బరి ఆధారిత కుటీర పరిశ్రమల నెలకొల్పుకునేందుకు ప్రభుత్వం విరివిగా రాయితీలు ఇస్తుంది. కోకోనట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల ద్వారా వ్యక్తులు, రైతులు, సంఘాలకు 35 శాతం రాయితీపై యూనిట్‌లను పెట్టుకునే అవకాశం ఉంది.

నేరాలు ఘోరాలు

ఏలేరు కాలువలో జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చదలాడ గ్రామానికి చెందిన ఖండవిల్లి జయబాబు(43) ఆదివారం గ్రామంలోని ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. అతని మృతదేహాన్ని దివిలి వంతెన వద్ద కనుగొని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ వి.మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిల్ చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఇంటి వద్ద పార్కు చేసిన మోటార్ సైకిల్ చోరీకి గురైనట్లు బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు .దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సురేష్ తన మోటార్ సైకిల్ ను రాత్రి ఇంటి బయటపెట్టాడు. మరునాడు ఉదయానికి తన మోటార్‌సైకిల్ లేకపోవడంతో చోరీ కి గురైందని, మోటార్ సైకిల్ తో పాటు తను రోజూ ఉపయోగించే ట్యాబ్ కూడా బండిలోనే ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుల పేర్కొన్నాడు. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - గోపాలపురం

ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం ఉదయం గోపాలపురం శివారు టుబాకో బోర్డు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనంతపల్లి గ్రామానికి చెందిన నలుగురు కూలీలతో ఖాళీ ట్రాక్టర్ వెల్లచింతలగూడెం గ్రామానికి బయలు దేరింది. ఈ క్రమంలో గోపాలపురం పొగాకు బోర్డు సమీపానికి వచ్చేసరికి డ్రైవర్ చిట్ల వాసు ట్రాక్టర్ వేగాన్ని నియంత్రించలేకపోయాడు. దీంతో అదుపుతప్పి బోల్తా పడింది. కూలీలు కౌజులూరి ఏడుకొండలు, పసివేదల కోటయ్య, పసివేదల గణేష్ , కలిదిండి బుల్లబ్బాయి టక్కు కింద ఉండిపోయారు. కూలీలు మట్టి తొలగించుకుని మార్గం చేసుకుని బయట పడ్డారు. సమాచారం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ వాహన సిబ్బంది అక్కడికి చేరుకుని కూలీలను గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. గాయపడిన కౌజులూరి ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ చిట్ల వాసుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు.

సారా రవాణా చేస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

సారాను రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు. బొబ్బిల్లంక గ్రామ శివారు బ్రిడ్జి వద్ద మోటార్ సైకిల్‌పై నాటు సారా రవాణా చేస్తున్న బొబ్బిల్లంక గ్రామానికి చెందిన దేవరకొండ శ్రీనివాస్, యరసాని వెంకన్నలను అదుపులోకి తీసుకున్నామనానరు. వారి నుంచి 30 లీటర్ల నాటుసారా, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, నిందితులను కోర్టుకు తరలించగా రిమాండ్ విధించిందని ఎస్ఐ తెలిపారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురం గ్రామంలో పేకాట శిబిరంపై ఆదివారం సీతానగరం ఎస్ఐ డి.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. రఘుదేవపురం చెరువు గట్టు సమీపంలో ఇంటిలోపల పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.16,340 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని, నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

ఐక్యతకు వన సమారాధనలు దోహదం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, ప్రత్తిపాడు

నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యతను చాటేందుకు వన సమారాధనలు దోహదం చేస్తాయని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం ఎంఎల్ఎ పంతం నానాజీ ఆధ్వర్యంలో కూటమి నాయకులతో కుటుంబాలతో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఏడాదికోసారి నిర్వహించుకునే వన సమారాధనలో కుటుంబ సమేతంగా నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం సంతోషకరమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని అన్నారు. ఎంఎల్ఎ పంతం నానాజీ మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో సతమత మయ్యే నాయకులు, కార్యకర్తలను ఏకం చేసి, వారి మధ్య సమన్వయం నింపేందుకు ప్రతి ఏటా ఈ వన సమారాధన ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఎలు వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎంఎల్‌ఎలు వర్మ, పిల్లి అనంతలక్ష్మి, స్టేట్ సివిల్ సప్లయి ఛైర్మన్ తోట సుధీర్, కూటమి గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులకు వివిధ ఆటల పోటీలను నిర్వహించారు.

వర్తకుల సంక్షేమానికి కృషి చేస్తా

నియోజకవర్గంలో వర్తకుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. ఆదివారం వర్తకుల సంఘం ఆధ్వర్యంలో వన సమారాధాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నన్ను ఎంఎల్‌ఎగా చూడొద్దని మీ కుటుంబ ఆడ పడుచుగా, బిడ్డగా చూడాలని కోరారు. వర్తకుల కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్తీక మాసంలో కులాలు, మతాలకు అతీతంగా ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొని అందరూ సంతోషంగా గడిపేలా కార్యక్రమాన్ని నిర్వహించిన సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

'అపార్' నమోదులో తప్పని అవస్థలు

పట్టించుకోని అధికారులు
అపార్‌తో విద్యార్థులకు పలు ప్రయోజనాలు

ప్రజాశక్తి - కాత్రేనికోన

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థిని, విద్యార్థులకు జారీ చేస్తున్న అపార్ గుర్తింపు కార్డు వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నా నమోదు చేసుకోవడానికి అవస్థలు తప్పడం లేదు. ఆధార్ కార్డు మాదిరిగా ఉండే అపార్ గుర్తింపు కార్డు నెంబర్ తో విద్యార్థి చరిత్ర మొత్తం క్షణాల్లో కంప్యూటర్లలో ప్రత్యక్షమవుతుంది. ఇప్పటికే అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు విద్యార్థులకు ఈ కార్డులు జారీ చేసే ప్రక్రియ చేపట్టారు. ఒక దేశం,ఒక విద్యార్థి గుర్తింపు కార్డు గా అపార్ ను పిలుస్తారు. అపార్ అంటే ఆటోమేటెడ్ పర్మినెంట్ అకౌంట్ రిజిస్ట్రీ ఆధార్ తో అనుసంధానం చేసిన ఈ ప్రత్యేక గుర్తింపు కార్డు సంఖ్యను నమోదు చేస్తే చాలు విద్యార్థి కుటుంబ వివరాలు, మార్కులు సర్టిఫికెట్లు తదితర వివరాలన్నీ క్షణాల్లో ఆన్లైన్లో తెలుసుకోవచ్చు. ఈ అపార్ నెంబర్ నే విద్యార్థి జీవితకాల గుర్తింపుగా పరిగణించనున్నారు. దీంట్లో విద్యార్థి అకాడమిక్ జర్నీ, విద్యా ప్రయాణం, విజయాలు పొందుపరుస్తున్నారు. విద్యార్థులకు అందించే ఆర్థిక ప్రయోజనాలు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు పంపిణీ, సాంఘిక సంక్షేమ హాస్టల్లో సీట్లు కేటాయింపు, ఉపకార వేతనాలు, బస్సు పాసులు తదితర సంక్షేమ పథకాలన్నీ ఈ గుర్తింపు కార్డు ద్వారానే ఇవ్వనున్నారు. ఇన్ని ప్రయోజనాలు ఉన్న అపార్ కార్డు నమోదులోనూ విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. విద్యార్థి పాఠశాలలో చేరిన సమయంలో నమోదు చేసిన అడ్మిషన్ రిజిస్టర్ లోని వివరాలతో ఆధార్ కార్డు వివరాలు సరిపోవాల్సి ఉంది. రెండిటి మధ్య పేర్లు, పుట్టిన తేదీ , జెండర్ తదితర వివరాలు తేడా ఉండడంతో అపార్ నమోదుకు ఆటంకం ఏర్పడుతోంది. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులకు పాట్లు తప్పడం లేదు. అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం ఆధార్ కార్డులో పేర్లు, పుట్టిన తేదీలు సరి చేసుకోవాలని పాఠశాల ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే పాఠశాల రికార్డులు ప్రకారం హెడ్ మాస్టర్ ఇచ్చే స్టడీ సర్టిఫికెట్లుతో పుట్టిన తేదీ, పేర్లు ఆధార్ కార్డులో మార్చుకునే అవకాశం లేకపోవడంతో వారికి ఇక్కట్లు తప్పడం లేదు. ఆధార్ కార్డులో పుట్టిన తేదీ లేదా పేరు సరి చూసుకోవాలంటే పంచాయతీ లేదా మున్సిపాలిటీ జారీ చేసిన ఆన్లైన్ పుట్టిన తేదీ సర్టిఫికెట్ లేదా పదో తరగతి పాస్ మార్క్ లిస్ట్, కాల పరిమితి ఉన్న పాస్పోర్టు వీటిలో ఏదో ఒకటి తప్పనిసరిగా ఉండాలి. అయితే పాఠశాల స్థాయి విద్యార్థులకు ఇవేమీ ఉండే అవకాశం లేదు.కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేరేటప్పుడు సరైన పేరు, పుట్టిన తేదీలు చెప్పడంలో పొరపాట్లు చేయడం, అలాగే పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు ఖచ్చితమైన పుట్టిన తేది సర్టిఫికెట్, ఆధార్ కార్డు ప్రకారం అడ్మిషన్ రిజిస్టర్ లో నమోదు చేయడంలో పొరపాట్లు చేయడం అపార్ కార్డు నమోదులో సమస్యలు ఏర్పడ్డాయి. తల్లిదండ్రులకు ఇది పెద్ద సమస్యగా ఏర్పడింది. పాఠశాలల్లో అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారమే తాము అపార్ నమోదు చేస్తామని ఆధార్ లోనే మార్చుకోవాలంటూ ఉపాధ్యాయులు సూచిస్తు న్నారు. ఆధార్ కార్డులో మార్చుకోవాలంటే సరైన పుట్టిన తేది సర్టిఫికెట్ వారి దగ్గర ఉండదు. పుట్టిన తేదీ సర్టిఫికెట్లో పుట్టిన తేదీ, పేరు సరి చేసుకోవడానికి మున్సిపాలిటీలు, కార్పొరేషన్ వద్దకు వెళ్తే ఒక అక్షరం లేదా అంకె కూడా మార్చము అంటూ అక్కడ అధికారులు నిరాకరిస్తుండడంతో తల్లిదండ్రులకు పెద్ద సమస్యగా ఏర్ప డింది. అపార్ పుణ్యమా అంటూ పాఠశాలలు, పంచాయతీలు, మున్సిపాలిటీలు, ఆధార్ సెంటర్లు చుట్టూ తల్లిదండ్రులు, పిల్లలు ప్రదక్షిణలు చేస్తున్నా పరిష్కారం కనుచూపుమేరలో వారికి కనబడడం లేదు. సర్టిఫికెట్ ఆధారాలు ఉంటేనే ఆధార్ కార్డులో మారుస్తామంటూ ఆధార నిర్వాహకులు చెబుతు న్నారు. తప్పుడు పేర్లు, పుట్టిన తేదీలు సరి చేసుకుని వస్తేనే అపార్ నమోదు చేస్తామంటూ ఉపాధ్యాయులు చెబుతుం డడంతో విద్యార్థులు తల్లి దండ్రులకు ఆందోళన చెందుతున్నారు. అపార్ కార్డు లేకుంటే విద్యార్థులకు అందే సంక్షేమ పథకాలు, రాయితీలు నిలిచి పోతాయని తల్లిదం డ్రుల ఆందోళన చెందుతున్నారు. ప్రతి పాఠశాలల్లోనూ పది నుంచి 20 వరకు విద్యార్థిని, విద్యార్థుల కు ఇదే సమస్య వెంటాడుతోంది. అపార్ నమోదుకు గడువు కూడా అయిపోతుందని ఉపాధ్యాయులు హెచ్చరిస్తుం డడం తో పిల్లల తల్లిదండ్రులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. వీరు గోడు ఆలకించే వారే కరువయ్యారు. విద్యార్థుల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులలో తప్పులు సవరణకు విద్యాశాఖ అధికారులు కనీసం ప్రత్యామ్నా య ఏర్పాట్లు చేయడం లేదు. ఇకనైనా అపార్‌తో విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను దృష్టిలో పెట్టు కుని ఆధార్‌లో పేర్లు, పుట్టిన తేదీలు సరి చేసు కునేందుకు విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పి ంచా లని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు

కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అబ్బులు

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు 'మదర్ థెరిసా' విద్యార్థులు

ప్రజాశక్తి - ఆలమూరు

రామచంద్రపురంలో ఈ నెల 24న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు మదర్ థెరిసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ సమస్థ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు ఆదివారం తెలిపారు. ఫైటర్స్ వివరాలు ప్రకారం బ్రౌన్ బెల్ట్ విభాగంలో బుంగ అశ్విన్, ఖండవిల్లి మహిమాకర్, బ్లూ బెల్ట్ విభాగంలో గెద్దాడ జాయ్ కిరణ్, జి.షణ్ముఖలు, గ్రీన్ బెల్ట్ విభాగంలో కట్టా అనుశ్రీకార్తికేయ, వడ్డి గిరిజలు, ఎల్లో బెల్ట్ విభాగంలో వడ్డీ కార్తికేయ, గెద్దాడ హర్షినిలు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సీనియర్ మాస్టర్స్ లంకే వెంకటరెడ్డి, నార్గాని చంద్ర కుమార్, టి.వెంకటలక్ష్మి, కోచస్ టీ.ఎల్.సందీప్ కిరణ్, మెరిపే సత్య కాంత్ తదితరులు అభినందించారు.

సమావేశంలో పాల్గొన్న బిఎస్ఐ కార్యకర్తలు తదితరులు

సమాజ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విజ్ఞాన వంతమైన సమాజ నిర్మాణంలో బుద్దిస్టలంతా ముఖ్య భూమిక పోషించాలని సామాజిక న్యాయ సాధన వేదిక అధ్యక్షుడు ఎస్ఆర్ వేమన సూచించారు. స్థానిక రాంజీ నగర్ లోని దుక్కిపాటి సూర్యనారాయణ ఇంటి వద్ద ఆదివారం బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బిఎస్ఐ) కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వేమన మాట్లాడుతూ విజ్ఞాన వంతమైన సమాజ నిర్మాణంలో బుద్దిస్టలు, అంబేద్కరీయులు పాలుపంచుకోవాలని సూచించారు. తొలుత బిఎస్ఐ అధ్యక్ష కార్యదర్శులు సుధీర్, వెంకట రమణల బృందం బుద్దుడు మరియు అంబేద్కర్ చిత్రపటాల వద్ద పూలు అర్పించి బుద్ధ వందనం చేసి జెండా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బుడితి బాబు రాజేంద్ర ప్రసాద్, సఖిలే పథ్వీరాజ్, కవి, ఆశీర్వాదం, వెంకటాచారి, గిడ్ల రమేష్, తర పట్ల వెంకటేశ్వర రావు,శరత్, కాశి పరశురామ్, ఆంజనేయులు తో పాటు పలువురు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

ప్రజాశక్తి - ఆలమూరు

మహనీయుల చిత్రపటాల వద్ద ఎజిపి ప్రసన్న దంపతులు, బౌద్ధ గురువు బోధి నివాళి

మహనీయుల అడుగుజాడల్లో నడవాలని స్థానిక కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్' (ఎజిపి)గా ఉద్యోగ బాధ్య తలు స్వీకరించిన బూసి విద్యా ప్రసన్నకు బౌద్ధ ధర్మ ప్రబోధకులు అరియ నాగసేనబోధి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో విద్యాప్రసన్న - వెర్రియ్య దంపతులకు, ప్రసన్న అత్తమామలు బూసి సుబ్బారావు, అన్నవరం దంపతులకు స్వగృహంలో నాగసేన బోధిచే త్రిరత్న వందన సంస్కార విధిని జరిపించి, ఆశీర్వదించారు. ముందుగా బుద్ధుడు, మహాత్మా జోతిరావు పూలే - సావిత్రి బాయి పూలే, అంబేద్కర్, రమాబాయి దంపతుల చిత్ర పటాలకు పూలమాల నివాళులు అర్పించారు.

గుండెపోటుతో సొసైటీ మాజీ అధ్యక్షుడు మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు ఉండు వీర వెంకట సత్యనారాయణ (46) ఆదివారం గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మండల మాల మహానాడు మాజీ అధ్యక్షుడిగా సేవలందించారు. ఆయన మరణానికి మండల షెడ్యూలు కులాల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు మరియు వైసిపి నాయకులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

త్వరలో బిసి రక్షణ చట్టం: మంత్రి సుభాష్

ప్రజాశక్తి - తాళ్లరేవు

బిసి కులాలకు రక్షణగా సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో బిసి రక్షణ చట్టం తేను న్నట్లు కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం మండ లంలోని జార్జిపేటలో శ్రీరామ శెట్టి బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకుల కోసం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పథకంలో రూ.2 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇస్తుందని తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో 10 నుంచి 20 ఎకరాల్లో ఇండస్ట్రీ హబ్‌లు ఏర్పాటు చేసి పరిశ్రమలు స్థాపించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సంఘం అధ్యక్షులు రాయుడు సూరిబాబు, గెద్దాడ శ్రీనివాస్ బృందం మంత్రి సుభాష్‌ను సత్క రించారు. ఆటలలో గెలు పొందిన చిన్నారులకు మంత్రి సుభాష్ బహు మతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కె.శివన్నా రాయణ, జి.సాయి, టి.లక్ష్మణరావు, ఎ.బాబూ రావు, స్థానిక నాయకులు జి.సూర్య నారాయణ, పి.ఏడు కొండలు, కమిటీ ప్రతినిధులు ఆర్.సూరిబాబు, జి.శ్రీనివాస్, డి.నీలాద్రి, సిహెచ్.మహేష్ పాల్గొన్నారు.

నిమ్మలపూడి శ్రీనుకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

మండల కేంద్రమైన గండేపల్లి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు నిమ్మలపూడి శ్రీను అన్నయ్య, క్రీస్తుశేషులు బాబ్జి కుమారుడు వివేక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం పట్ల పలువురు పరామర్శించారు, ఆదివారం మాజీ సొసైటీ అధ్యక్షులు, టిడిపి నాయకులు పరిమి బాబు నిమ్మలపూడి శ్రీనును కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు, చిన్న వయసులోనే చార్టెడ్ అకౌంట్డడ్ చదివి మంచి ఉన్నత స్థాయికి ఎదగవలసిన సమయంలో అనారోగ్యం వల్ల మృతి చెందడం బాధాకరమని అన్నారు. పరామర్శించిన వారిలో తొండాపూ రమణారెడ్డి, సంకవల్లి రమేష్, కంటిపూడి రామారావు, పేరారుపు సత్యనారాయణ, పైపూరి సారంగబాబు ఉన్నారు.

బాధితునికి నిత్యావసరాల అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో జరిగిన విద్యుత్ షాక్ సర్క్యూట్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి పురాణపండ సత్యనారాయణమూర్తి హరి కుసుమాంబ చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యవసరాలు, 25 కేజీల బియ్యం, దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు కూలీ సంఘం ప్రధాన రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లా డుతూ సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ఆదుకున్న ట్రస్ట్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు పురాణ పండ శేషసాయిశర్మ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధిత కుటుం బాన్ని ఆదుకోవడం జరిగిందన్నారు. ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉంటే ట్రస్ట్‌ను సంప్రదిస్తే తాము ఆదుకుంటామని ఆయన తెలిపారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ కార్యక్రమాలు సోమవారం యథావిధిగా జరుగుతాయని కమిష నర్ భావన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకూ డయల్ యువర్ కమిషనర్‌కు ఫోన్లో సమస్యలను వివరించవచ్చునని తెలిపారు. అనంతరం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు నేరుగా సమస్యలపై అర్జీలను అందజేయవచ్చునని అన్నారు. నగర ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

బాధిత కుటుంబానికి ముదునూరి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పెద్దిపాలెం గ్రామానికి చెందిన విత్తనాల ప్రసాద్ ఇటీవల బాణాసంచా కాలుస్తూ గాయపడ్డాడు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.20 వేల ఆర్థిక సాయాన్ని బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని అన్నారు. గ్రామంలో వైసిపి కార్యకర్తలను ఆయన పరిచయం చేసుకున్నారు. పార్టీని బలోపేతం చేయడం లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బెహరా దొరబాబు, సర్పంచ్‌లు ఏపూరి రామారావు, దేవర రమేష్‌యాదవ్, పిల్ల చిన్నా, లొండ బాబు పాల్గొన్నారు.

బలరాంపురంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరాంపురం గ్రామంలో మాజీ సర్పంచ్ పైల పైడ్రాజు బంధువులకు చెందిన వేదంతా ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ పైల సీత, ఎంపిటిసి సభ్యులు సోమరౌతు రవి ప్రారంభించారు. ఈ శిబిరంలో 125 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. బిపి. షుగర్. గుండె పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి కృష్ణ, బోడ్డు రమణ పాల్గొన్నారు.

కోటేశ్వరరావు నియామకంపై హర్షం

ప్రజాశక్తి - అమలాపురం

ఆంధ్రప్రదేశ్ ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావును ఎపి గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్‌గా నియమించడం పట్ల ఆంధ్రప్రదేశ్ వికలాంగుల మహా సంఘటన సంఘం ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. కోటేశ్వరావు వికలాంగుల ఛైర్మన్ గా ఉన్న సమయంలో వికలాంగులకు పూర్తి సహాయ సహకారాలు అందించారని, ఆయన మరిన్ని పదవులు అలంకరించాలని ఎపి వికలాంగుల మహా సంఘటన మాజీ ప్రతినిధి నిమ్మకాయ సురేష్ తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ కాపురస్తులైన నొక్కు లూధి భర్త శ్రీను వయసు.33 సంవత్సరాలు తేదీ.**1.11.2024** న మల్లేపల్లి నుండి జగ్గంపేట మోటార్ సైకిల్ మీద బయలుదేరి వెళ్తున్నప్పుడు మార్గమధ్యలో నా యొక్క పాస్‌పోర్టు నెంబరు.**N1722926** గల పాస్‌పోర్టు పోయినది ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

నా అడ్రస్
నొక్కులూది , భర్త. శ్రీను,
మల్లేపల్లి గ్రామం, డోర్ నెంబర్.2-26.
గండేపల్లి మండలం, కాకినాడ జిల్లా,
పిన్: 533435,ఫోన్ నెంబర్.7396713335

పాస్ పోర్ట్ పడిపోయినది

డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, ఆదుర్రు గ్రామానికి చెందిన బొంతు కృష్ణ S/o. గంగారామ్‌కు చెందిన పాస్ పోర్టు పడిపోయినది. పాస్ పోర్ట్ నెంబర్ P5701690. ది 01-11-2024న తేదీన ఇంటి వద్ద నుంచి మామిడికుదురు సెంటర్‌కు పాస్ పోర్ట్ తీసుకొని మోటర్ సైకిల్‌పై వెళు తుండగా మార్గం మధ్యలో పడిపోయింది. దొరికిన వారు క్రింది అడ్రస్ కు అందజేయగలరు.

బొంతు కృష్ణ, S/o. గంగారామ్
Do. No. 5-122, ఆదుర్రు,
మామిడికుదురు మండలం

IN THE COURT OF THE 12th ADDL.DIST.JUDGE:PITHAPURAM
O.S.NO.5/2023

Between:
Thatavarthy Subrahmanyam and others ...Plaintiffs
And
Chikkam Devika Rani and another ...Defendants

To
[D1] Chikkam Devika Rani, D/o. Subbarao, aged 52 yrs, Advocate, D.No.68-10-14A, Near Ideal College, Vidyuth Nagar, Kakinada

పై నెంబరు కేసులో 1వ ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక తప్పించుకుని తిరుగుచున్నారు. మీ హజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు **15-11-2024** ఉదయం **10** గం॥లకు వాయిదా వేసినారు. మీరు హాజరు కానిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.

A.V.CH.S.S.MURTHY
SRI CH.V.APPARAO
A.SIDHVI RAMANA KASHYAP
Advocates,
Ashok nagar, Kakinada
Cell:9848338335

నోటీసు
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ మరియు సెషన్స్ జడ్జి, కాకినాడ
F.D.P. 20/2020 in O.S.261/1985

కొత్తలంక కామరాజు మరియు ఇతరులు ...పిటీషనర్లు
మరియు
కొత్తలంక విశ్వనాథం మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు 1 టు 36

టు:

19. కొత్తలంక అన్నపూర్ణ, (భర్త) (లేటు) శ్రీకంఠ శివాచార్యులు, వయస్సు 58, హిందు, డోర్ నెం. 67-25-114/2ఎ, సింహాచల నగరం, విశ్రాంతిపురం, రాజమహేంద్రవరం.

20. కొత్తలంక సతీష్, (తండ్రి) శ్రీకంఠ శివాచార్యులు, వయస్సు 40, హిందు, డోర్ నెం. 67-25-114/2ఎ, సింహాచల నగరం, విశ్రాంతిపురం, రాజమహేంద్రవరం.

21. కొత్తలంక శ్రీనివాస్, (తండ్రి) శ్రీకంఠ శివాచార్యులు, వయస్సు 35, హిందు, డోర్ నెం. 67-25-114/2ఎ, సింహాచల నగరం, విశ్రాంతిపురం, రాజమహేంద్రవరం.

22. కొత్తలంక విశ్వేశ్వర శర్మ, (తండ్రి) (లేటు) సత్యనారాయణ, వయస్సు 45, హిందు, అర్చక, డో.నెం: 4-439/1, ఊబలంక వయా రావులపాలెం, ఆలమూరు మండలం, కోనసీమ జిల్లా.

23. కొత్తలంక విశ్వనాథం (చిట్టిబాబు), తండ్రి (లేటు) సత్యనారాయణ, వయస్సు 43, హిందూ అర్చక, డో. నెం. 4-439/1, ఉమామహేశ్వర స్వామి టెంపుల్, ఊబలంక, వయా రావులపాలెం, ఆలమూరు మండలం, కోనసీమ జిల్లా.

24. కొత్తలంక వీరభద్రరావు (రాజా), (తండ్రి) సత్యనారాయణ, వయస్సు 41, హిందు, ఎంప్లాయ్, డో.నెం. 4-439/1, ఊబలంక, వయా రావులపాలెం, ఆలమూరు మండలం, కోనసీమ జిల్లా.

25. పూజ్యం సత్యకళావతి, భర్త సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, వయస్సు 38, హిందూ గృహిణి, డో.నెం. 4-439/1, ఊబలంక, వయా రావులపాలెం, ఆలమూరు మండలం, కోనసీమ జిల్లా.

26. పుల్లేటికుర్తి వీరగవరమ్మ, భర్త నాట్ నౌన్, వయస్సు 35, తండ్రి కొత్తలంక సత్యనారాయణ వయస్సు 35, హిందు, గృహిణి, డో. నెం. 4-439/1, ఊబలంక, వయా రావులపాలెం, ఆలమూరు మండలం, కోనసీమ జిల్లా.

27. కొత్తలంక విస్సన్న, తండ్రి (లేటు) రామచంద్రరావు, వయస్సు 60, హిందు, డో.నెం. 2-115/2, శివాలయం వీధి, జెడ్. రాగంపేట పోస్టు, జగ్గంపేట, కాకినాడ జిల్లా.

28. కొత్తలంక సూర్యనారాయణశర్మ, తండ్రి (లేటు) రామచంద్రరావు, వయస్సు 58, హిందూ, డో.నెం.2 - 115/2, శివాలయం వీధి, జె. రాగం పేట పోస్టు, వయ జగ్గంపేట, కాకినాడ జిల్లా.

29. పుల్లేటికుర్తి వీరచంద్రలక్ష్మి, భర్త నాట్ నౌన్, కేరాఫ్ కొత్తలంక శేషమ్మ, వయస్సు 56, హిందు, డో.నెం.2-115/2, శివాలయం వీధి, జె. రాగంపేట పోస్టు, వయ జగ్గంపేట, కాకినాడ జిల్లా.

30. అయినవిల్లి వీరరాఘవమ్మ, భర్త నరసింహమూర్తి, వయస్సు 54, హిందూ, డో.నెం. 2-115/2, శివాలయం వీధి, జె. రాగంపేట పోస్టు, వయ జగ్గంపేట, కాకినాడ జిల్లా.

31. వాడ్రేవుల శేషమ్మ, భర్త సుందరరావు, వయస్సు 52, హిందు, డో.నెం. 2-115/2, శివాలయం వీధి, జె. రాగంపేట పోస్టు, వయ జగ్గంపేట, కాకినాడ జిల్లా.

32. చంద్రమౌళి లలిత భర్త చిట్టిబాబు, కేరాఫ్ బ్రాంచ్ పోస్టుమాస్టర్, వయస్సు 38, హిందు, గృహిణి, కాత్రావులపల్లి, జగ్గంపేట మండలం, కాకినాడ జిల్లా, పెద్దాపురం జేసిజె లిమిట్స్

33. దంతుకుర్తి విజయలక్ష్మి, భర్త సుబ్రహ్మణ్యం, వయస్సు 31, హిందు, గృహిణి, శివాలయం అర్చకులు, పెద్దబ్రహ్మదేవం గ్రామం, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా,

34. కొత్తలంక రాజాప్రభావతి భర్త ఉమామహేశ్వరరావు, వయస్సు 44, హిందు, గృహిణి, శివాలయం శివారు, గొల్లలమామిడాడ, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా

35. కొత్తలంక ఫణిపూర్ణ రాజేష్ తండ్రి (లేటు) ఉమా మహేశ్వరరావు, వయస్సు 25, హిందు, అర్చక, శివాలయం శివారు, గొల్లలమామిడాడ, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.

36. యలమంచిలి అన్నపూర్ణ భర్త (లేటు) సత్యనారాయణ, వయస్సు 31, హిందు, అర్చక, శివాలయం శివారు, గొల్లలమామిడాడ, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు దావాలోని 9 నుండి 13 రెస్పాండెంట్ల వారసులైన 14 నుండి 36 వరకు జత చేయబడిన వారసులను IA No 830/2022/ Dt. 12-09-2023, వారసులుగా చేర్చుటకు పిటీషనరు వాది దాఖలు చేసిన పిటీషన్, సదరు కేసులో రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్య పూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేసియున్నారు. కావున **ది. 26-11-2024 తేదీ పగలు 10 గంటల 30 నిమిషాలకు** మీరు గానీ, మీ ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ వాదన చేసుకొనవలెను. లేనియెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియజేయడమైనది.

(By Court Order)

అడపా సురేష్
అడ్వకేట్ ఫర్ పిటీషనర్
కాకినాడ. సెల్: 9154874569